క్లుప్తంగా

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ



శ్రీవారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలను తీసుకువస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా శ్రీవారి అలంకరణకు శేషవస్త్రం, అభిషేక సామగ్రిని ప్రదక్షిణగా మంగళవాయిద్యాల నడుమ తీసుకువెళ్లారు. అభిషేకానంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు.

గంజాయితో పట్టుబడ్డ వ్యక్తి అరెస్ట్

పద్మనాభం: మండలంలోని పాండ్రంగి పంచాయతీ సామయ్యవలసలో శుక్రవారం గంజాయితో పట్టుబడిన వ్యక్తిని అరెస్ట్ చేశామని సీఐ సీహెచ్ శ్రీధర్ తెలిపారు. వివరాలివి.. సామయ్యవలసలో గంజాయి రవాణా జరుగుతోందని అందిన సమాచారం మేరకు తమ సిబ్బందితో దాడి చేశామన్నారు. ఈ దాడిలో ఒడిశా రాష్ట్రానికి చెందిన జగెల్ పుటేల్ నుంచి ఒక కిలో గంజాయి, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్టు సీఐ తెలిపారు. అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

చిన్నారిని కొట్టిన ఉపాధ్యాయినిపై చర్యలేవి?

తగరపువలస: జీవీఎంసీ రెండోవార్డు సంతపేట ప్రాథమిక పాఠశాలలో ఇటీవల 3వ తరగతి విద్యార్థిని భావన లాస్యపై ఉపాధ్యాయురాలు సన్యాసమ్మ కర్రతో తలపై కొట్టిన ఘటనలో ఏం చర్యలు తీసుకున్నారని పిల్లలు తల్లిదండ్రులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఆమె కొట్టడంతోనే విద్యార్థి మెదడులో గాయాలతో పాటు మూర్ఛకు గురైందని పాఠశాలకు చెందిన తల్లిదండ్రులంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై ఈ నెల 12న విచారణకు వచ్చిన డీఈవో ప్రేమ్‌కుమార్ కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నట్టు కూడా తెలిపారు. ఇదిలా ఉండగా ఉపాధ్యాయురాలిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఒక సీనియర్ ప్రధానోపాధ్యాయుడు జిల్లా స్థాయిలో తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. దీంతో తమకు న్యాయం జరగదని తల్లిదండ్రులు వాపోతున్నారు. గతంలో ఉపాధ్యాయురాలిపై ఉన్న మెమోల సంగతి డీఈవో వద్ద దాచినట్టు మిగిలిన ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు.

సీఆర్పీలు ఏమి చేస్తున్నట్టు?

పాఠశాలలకు, విద్యాశాఖకు సమన్వయకర్తలుగా పనిచేసే సీఆర్పీలు(క్లస్టర్ రీసోర్స్ పర్సన్) అసలు భీమిలిలోని ప్రభుత్వ పాఠశాలలను ఇటీవల సందర్శించిన దాఖలాలే లేవు. భీమిలి డైట్ అధ్యాపకులు అప్పుడప్పుడు సందర్శిస్తున్నా.. సీఆర్పీలు పాఠశాలల ముఖమే చూడటం మానేశారు. అంతేకాకుండా ఒక సీఆర్పీకి ఎక్కువ పాఠశాలలు, మరో సీఆర్పీకి తక్కువ పాఠశాలలు కేటాయించి వ్యత్యాసం చూపుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో చాలా వరకు లోపాలు ఉన్నా బయటకు రావడం లేదు. సంతపేట ప్రాథమిక పాఠశాలను కూడా సీఆర్పీ ఈ విద్యా సంవత్సరంలో సందర్శించనే లేదు.

మెగా బైబిల్ ఎగ్జిబిషన్ ప్రారంభం

మద్దిలపాలెం: రేసపువానిపాలెంలోని క్యూఎంబీ చర్చి ఆవరణలో బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా, విశాఖపట్నం ఆధ్వర్యంలో మెగా బైబిల్ ఎగ్జిబిషన్ కం సేల్ శుక్రవారం ప్రారంభమైంది. విజన్ నేటివ్స్ డైరెక్టర్ సీహెచ్ అర్జునరావు ఈ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా ఏపీ ఆగ్జిలరీ సెక్రటరీ కె.జాన్ విక్రమ్ మాట్లాడుతూ తెలుగు, ఇంగ్లిష్, ఇతర భాషల బైబిల్స్, బుక్స్, అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ ఎగ్జిబిషన్ ఆదివారం వరకు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా రూపొందించిన బైబిల్స్‌ను అతిథులు ఆవిష్కరించారు.

ఏ నిమిషానికి ఏమి జరుగునో ?

ఆ సర్కిల్‌ను చూస్తే గుండెల్లో దడ పుడుతుంది. వేర్వేరు మార్గాల్లో వస్తున్న వాహనాలతో ఆ ప్రాంతం కిక్కిరిసి ఉంటుంది. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పూర్తి స్థాయి సిబ్బంది లేరు.. పువ్వులకు హోల్‌సేల్ మార్కెట్ కావడంతో ఎక్కడికక్కడే వాహనాలు నిలిపేసి మరీ కొంటుంటారు వాహనదారులు. మరోవైపు పూలు విక్రయించే మహిళలు వాహనాల వెంటబడి పరుగులు తీస్తుండటంతో ఏ క్షణాన ఏ ప్రమాదం జరుగుతుందో తెలియదు.. బస్సుల కోసం నిరీక్షించే ప్రయాణికులూ అక్కడే.. వెరసి ఆ ప్రాంతం పద్మవ్యూహాన్ని తలపిస్తోంది.



ఆనందపురం ఫ్లై ఓవర్ల కింద వాహనాల రద్దీ



తగరపువలస: వేములవలస కూడలిలో ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారింది. జాతీయ రహదారి విస్తరణ తర్వాత పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారింది. ఆరేళ్ల క్రితం జాతీయరహదారుల విస్తరణకు ముందు విశాఖ నుంచి ఆనందపురం మీదుగా తగరపువలస వైపు వచ్చే వాహనాలు నేరుగా ఫ్లై ఓవర్ మీదుగా వెళ్లిపోయేవి. ఆనందపురంలో వాహనాలు దిగాలనుకునేవారు ఫ్లై ఓవర్‌పై దిగి మెట్ల మార్గంలో వేములవలస మీదుగా మండలంలోని వివిధ గ్రామాలకు చేరుకునేవారు. అలాగే పెందుర్తి–తగరపువలస మీదుగా రాకపోకలు సాగించే వాహనాలు ఫ్లై ఓవర్ కింద నుంచి వెళ్లిపోయేవి. జాతీయరహదారుల విస్తరణ తరువాత ఈ పరిస్థితులు మారిపోయాయి. నగరం నుంచి వచ్చే అన్ని రకాల వాహనాలను ఫ్లై ఓవర్ మీదుగా కాకుండా వేములవలస మార్కెట్‌ను ఆనుకుని సర్కిల్ నిర్మించి అక్కడి నుంచి తగరపువలస వైపు మళ్లిస్తున్నారు. దీంతో ఈ జంక్షన్‌లో ట్రాఫిక్ విపరీతంగా ఉంటోంది. మార్కెట్‌కు వచ్చే వినియోగదారులతో రద్దీగా ఉండే ఈ కూడలి ఇప్పుడు వాహనాల మళ్లింపుతో మరింత కఠినంగా మారిపోయింది.

వేర్వేరు మార్గాలలో నగరంతో పాటు పెందుర్తి నుంచి తగరపువలస వైపు వచ్చే వాహనాలతో వేములవలస కూడలి ప్రమాదకరంగా మారిపోయింది. అన్నిరకాల వాహనాలు వచ్చి వేములవలస మార్కెట్ కూడలి, ఫ్లై ఓవర్ల కింద, తగరపువలస, పెందుర్తి మార్గాలలో నిలిచిపోతున్నాయి.

పరుగులు తీస్తూ ప్రమాదాలబారిన..

బస్సులు, ఆటోల కోసం ప్రత్యేక జోన్ లేకపోవడంతో ప్రయాణికులు సైతం రోడ్డుమీదే నిరీక్షించవలసి వస్తుంది. దీనికితోడు మార్కెట్‌లో పువ్వులు విక్రయించే మహిళలు వాహనాల వెంట పరుగులు తీస్తూ పడిపోతున్నారు. వాహనాల యజమానులు సైతం రద్దీగా ఉన్న కూడలిలో నిలిపి కిందకు దిగి రోడ్డుపై విక్రయించే పువ్వులతో పాటు చౌకగా మార్కెట్‌లో లభించే పూలకోసం ధీమాగా వెళ్లివస్తున్నారు. దీంతో ఒకదాని వెంట ఒకటి వాహనాలు వరుసగా వస్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకు వస్తుందోనని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సిబ్బంది అంతంతమాత్రమే

ఆనందపురంలో తగినంత ట్రాఫిక్ సిబ్బంది లేకపోవడంతో నిత్యం వాహనాల రద్దీని అదుపు చేయలేకపోతున్నారు. గతంలో లాగా ఫ్లై ఓవర్ మీద నుంచి వాహనాల రాకపోకలు సాగించడమో లేదంటే మార్కెట్ కూడలిలో ప్రయాణికులు, పువ్వుల విక్రయదారులు వాహనాల వెంట పరుగులు తీయకుండా ప్రత్యేక జోన్ ఏర్పాటు చేయడమో చేయాలని పలువురు కోరుతున్నారు.



ఆనందపురం, పెందుర్తి నుంచి తగరపువలస వైపు వాహనాల రద్దీ



ఆనందపురం ఫ్లై ఓవర్ కింద పువ్వులు విక్రయిస్తున్న మహిళలు



వాహనాల రద్దీతో విశాఖ నుంచి ఆనందపురం సర్కిల్ మార్గం



వాహనాల వెంటపడి పువ్వులు విక్రయిస్తున్న మహిళలు

ఇష్టపడి చదవాలి



మాట్లాడుతున్న ఎంఈవో బాబూలాల్

పద్మనాభం: కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే మంచి మార్కులు సాధించవచ్చని ఎంఈవో ఎస్‌డీ బాబూలాల్ విద్యార్థులకు సూచించారు. మండలంలోని ఆర్‌వీ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు జరుగుతున్న ప్రత్యేక తరగతులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బాబూలాల్ మాట్లాడుతూ విద్యార్థులు ఇళ్ల వద్ద సమయాన్ని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో అధిక మార్కులు సాధించిన వారికి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం వి.శంకరరావు పాల్గొన్నారు.

దుర్గాలమ్మకు ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో అమ్మవారు

మధురవాడ: చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయంలో మాఘమాసం కృష్ణ పక్షం విదియ ను పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. నిత్యార్చనతో ప్రారంభించి కుంకుమ పూజలు, పుష్పార్చనల అనంతరం విశేష అలంకరణ చేశారు. మిథిలాపురి వుడా కాలనీ వాసులు శ్రీనివాసన్ కుటుంబ సభ్యుల సహాయ సహకారాలతో అమ్మవారికి పొంగల్ ప్రసాదం నివేదించి, భక్తులకు పంచి పెట్టారు. అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, ఉపాధ్యక్షుడు పీవీజీ అప్పారావు, సెక్రటరీ నాగోతి తాతారావు తదితరులు పాల్గొన్నారు.

జంక్షన్‌లో జారిపడిన ఐరన్ పైపులు

తప్పిన ప్రమాదం

పీఎం పాలెం: జాతీయ రహదారిపై శుక్రవారం తృటిలో ప్రమాదం తప్పింది. ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలివి.. ఆనందపురం వైపు నుంచి నగరం వైపునకు ఐరన్ పైపుల లోడుతో ఓ మినీ లారీ వెళ్తోంది. సరిగ్గా కొమ్మాది కూడలి సిగ్నల్స్ వద్దకు వచ్చేసరికి బ్రేకులు వేయడంతో పైపులకు కట్టిన కట్లు తెగి, పైపులు చెల్లాచెదురుగా జారి పడ్డాయి. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ట్రాఫిక్ పోలీసులు కలాసీలను రప్పించి పైపులను వాహనం పైకి ఎక్కించి కట్లు కట్టించారు. ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ఈ ప్రమాదంలో ఎటువంటి నష్టం కలగక పోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. వాహనం ప్రయాణిస్తున్న సమయంలో ప్రమాదం జరిగితే నష్టం తీవ్రంగా ఉండేదన్నారు.



కొమ్మాది కూడలిలో ఐరన్ పైపులు చెల్లాచెదురుగా పడిపోవడంతో స్తంభించిన ట్రాఫిక్

అతివల అక్షరాస్యతతోనే ఆర్థికాభివృద్ధి



వలంటీర్లకు అవగాహన కల్పిస్తున్న డీఆర్‌డీఏ అధికారులు

పద్మనాభం: మహిళలు అక్షరాస్యులైనప్పుడే ఆర్థికంగా అభివృద్ధి చెందగలరని డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి అన్నారు. పద్మనాభంలోని వెలుగు కార్యాలయంలో శుక్రవారం ఉల్లాస్‌పై వలంటీర్లకు ఇచ్చిన రెండో విడత శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులందరూ అక్షరాస్యులు కావాలన్నారు. మహిళలు అక్షరాస్యులైతే బ్యాంకులో ఆర్థిక లావాదేవీల కోసం ఇతరులపై ఆధారపడకుండా, తమంతట తామే చూసుకోగలరన్నారు. చదువు రాకపోతే ఈ లావాదేవీల్లో మోసపోయే ప్రమాదం ఉందన్నారు. ఎంపీడీవో ఎం.విజయ కుమార్ మాట్లాడుతూ వయోజనులందరినీ వంద శాతం అక్షరాస్యులు చేయడంతో పాటు డిజిటల్, సాంకేతిక విద్య నేర్పడమే ఉల్లాస్ ధ్యేయమన్నారు. డీఆర్‌డీఏ సిబ్బంది ఉల్లాస్‌పై వలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. వలంటీర్లకు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సాయి రమేష్, ప్రభాకర్ పాల్గొన్నారు.

విజయగౌరిని గెలిపించండి



మారికవలసలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్సీ శర్మ

మధురవాడ: మహిళా ప్రతినిధిగా ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరిని శాసన మండలికి పంపించాలని మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ కోరారు. యూటీఎఫ్, వివిధ ప్రజా సంఘాలు బలపరిచిన పీడీఎఫ్ అభ్యర్థి విజయ గౌరి విజయాన్ని కాంక్షిస్తూ మధురవాడ పరిసర ప్రాంతాల్లోని విద్యాసంస్థల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. విజయ గౌరికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీ చేకూర్చాలని ఉపాధ్యాయులను అభ్యర్థించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు డి.అప్పలరాజు, ఆర్‌కేఎస్‌వీ కుమార్, ఆర్.వెంకటరమణ, కె.పద్మ, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆపద వేళ మంచి మిత్రుడు అవసరం

- బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు
- కొనసాగుతున్న రామాయణ ప్రవచనాలు

మధురవాడ: ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ మంచి మిత్రుని అవసరం ఎంతో ఉంటుందని శ్రీరామాయణం మనకు తెలియజేస్తుందని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త బ్రహ్మశ్రీ డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు పేర్కొన్నారు. మధురవాడ గాయత్రి విద్యాపరిషత్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న సంపూర్ణ రామాయణ ప్రవచనాల్లో భాగంగా శుక్రవారం ఆయన అనేక అంశాలు తెలియజేశారు. రామలక్ష్మణులు కొంచారణ్యం దాటి ముందుకు వెళ్లడం, కబంధుని వృత్తాంతం, సుగ్రీవునితో మైత్రి కోసం రుష్యమూక పర్వతం వైపు వెళ్తున్న వారికి శబరి కనిపించడం, ఎంతో భక్తితో రాముని సేవించడం, ఆయన అనుమతితో అగ్నికి తన శరీరాన్ని సమర్పించడం తదితర అంశాలతో అరణ్య కాండ ప్రవచనం పూర్తి చేశారు. ఈ సందర్భంగా చాగంటి కోటేశ్వరావు ఏయూ విశ్రాంత తెలుగు ఆచార్యులు వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రి దంపతులను సత్కరించారు.



ప్రవచిస్తున్న బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

ఎండీఎం కార్మికుల ధర్నా

మధురవాడ: మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోందని సీఐటీయూ జిల్లా నాయకురాలు పి.మణి ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులపై వేధింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ ఎండీఎం కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. కార్మికులకు మూడు నెలల బిల్లులు, వేతనాలు కూడా చెల్లించపోగా వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. అన్నం ముద్ద అవుతుందన్న నెపంతో, కార్మికులు వద్దు అని వాడపాలెంలో విద్యార్థుల తల్లిదండ్రులు కలెక్టర్‌కు ఫిర్యాదు ఇచ్చారన్నారు. ఈ విషయమై పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పి.రాజ్‌కుమార్, జి.మంగశ్రీ, పలువురు కార్మికులు పాల్గొన్నారు.



మధురవాడ జోనల్ ఆఫీసు వద్ద ధర్నా చేస్తున్న ఎండీఎం కార్మికులు

యథేచ్ఛగా అనుమతుల్లేని బడ్డీలు



బీచ్ సమీపంలోని మరుగుదొడ్లు పక్కన కొత్తగా ఏర్పాటు చేసిన బడ్డీ



అల్లూరి పార్కు సమీపంలో ఉన్న బడ్డీ

భీమునిపట్నం: భీమిలి బీచ్ సమీపంలోని రోడ్డు వద్ద ఇటీవల పెద్ద బడ్డీలు అనుమతులు లేకుండా ఏర్పాటవుతున్నాయి. చిరుతిళ్లు, తినుబండారాలకు సంబంధించిన చిన్న బడ్డీలు చాలా కాలంగా ఉన్నాయి. కానీ, ఇటీవల పెద్ద సైజులో ఫాస్ట్‌ఫుడ్స్‌కు సంబంధించిన బడ్డీలు ఎక్కడపడితే అక్కడ ఏర్పాటవుతున్నాయి. వీటికి ఎటువంటి అనుమతులు లేకపోగా పెద్దవి కావడంతో ఇబ్బందికరంగా ఉంటున్నాయి. ఇక్కడ పబ్లిక్ మరుగుదొడ్లు పక్కన రెండు వైపులా కొన్ని బడ్డీలు ఉండగా, ఇప్పుడు కొత్తగా పెద్ద బడ్డీని ఏర్పాటు చేశారు. ఇంకా ఈ బడ్డీ ప్రారంభం కాలేదు. ఇది ప్రారంభమై, సందర్శకులు వస్తూ ఉంటే మరుగుదొడ్లకు వెళ్లి వచ్చేవారికి చాలా ఇబ్బందిగా ఉంటుంది. దీనిపై అధికారులు స్పందించి అనధికార బడ్డీలపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

దామోదరం సంజీవయ్యకు ఘన నివాళులు



సంజీవయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న 16వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ మురళీకృష్ణ

పీఎం పాలెం: దివంగత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతిని బక్కన్నపాలెం ఏపీఎస్‌పీఎఫ్ 16వ పోలీస్ బెటాలియన్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బెటాలియన్ కమాండెంట్ కేవీ మురళీకృష్ణ సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఆయన సేవలను, పాలనా దక్షతను కొనియాడారు. కార్యక్రమంలో బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ సీహెచ్‌వీఎస్ పద్మనాభరాజు, అసిస్టెంట్ కమాండెంట్లు పి.సత్యం వి.నారాయణ, జి.ఇలియా సాగర్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశానవాటికలో సూదులు

బయోమైనింగ్ వ్యర్థాలతో పూడ్చడంతో పలువురి అవస్థలు

తగరపువలస: నమ్మివానిపేట డంపింగ్‌యార్డులోని గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ నుంచి బయో మైనింగ్ వ్యర్థాలను ఇటీవల కాంట్రాక్టర్ గోస్తనీనది వద్ద తగరపువలస శ్మశానవాటికలో వేసి చదును చేసిన సంగతి తెలిసిందే. ఈ శ్మశానవాటికకు బంగ్లామెట్ట, రామన్నపేట, పాత లోకల్ ఆఫీసు వీధి, తగరపువలస, గాంధీబొమ్మ వీధి, ఆదర్శనగర్, సంగివలస కాలనీ, సత్యనారాయణపేట తదితర గ్రామాలను చెందిన మృతులను తీసుకువచ్చి ఖననం చేస్తుంటారు. హిందువులకు చెందిన ఈ శ్మశానవాటికలో బయో మైనింగ్ వ్యర్థాల కారణంగా అందులోని మెడికల్ సూదులు ఇప్పుడు పలువురి పాదాలలోకి చొచ్చుకుపోతున్నాయి.

పైపై ప్రకటనలే..


బయో మైనింగ్ వ్యర్థాలను తొలగిస్తున్నట్టు జీవీఎంసీ ప్రకటన చేసినా వాస్తవంగా ఎలాంటి తొలగింపులు జరగలేదు. కాలక్రమేణా మెడికల్ సూదులు తుప్పుపట్టి ప్రమాదకరంగా మారుతున్నాయని శ్మశానవాటికకు వచ్చేవారు ఆందోళన చెందుతున్నారు. డంపింగ్‌యార్డు నుంచి శ్మశానవాటికకు బయో మైనింగ్ వ్యర్థాలు తరలించిన కాంట్రాక్టర్ గ్రావెల్‌తో పూడ్చిపెట్టనున్నట్టు ప్రకటించినా రెండు వారాలుగా ఎలాంటి పనులు చేపట్టలేదు. జీవీఎంసీ ఇప్పటికైనా జోక్యం చేసుకుని బయో మైనింగ్ వ్యర్థాలలోని ప్రమాదకరమైన సూదులు, గాజు పెంకులు బయటకు కనిపించకుండా గ్రావెల్‌తో పూడ్చేలా చర్యలు తీసుకోవాలని తగరపువలస ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



డంపింగ్‌యార్డు నుంచి శ్మశానవాటికలో వేసిన బయో మైనింగ్ వ్యర్థాలు

డ్రైనేజీలోకి దూసుకుపోయిన కారు

తగరపువలస: భీమిలి రోడ్డులో శుక్రవారం సాయంత్రం చిల్లపేట చెరువును ఆనుకుని డ్రైనేజీలోకి కారు దూసుకుపోయి బోల్తా పడింది. ఈ సంఘటనలో పెను ప్రమాదం తప్పింది. కొమ్మాదికి చెందిన నలుగురు యువకులు తగరపువలస మీదుగా భీమిలి వైపు వేగంగా వెళ్తూ ఈ ప్రమాదానికి గురయ్యారు. కారు అదుపు తప్పి రోడ్డును రాసుకుంటూ ఎగిరి కాలువలోకి పడిపోయింది. ఈ ప్రమాదం బారిన పడిన యువకులు వెంటనే తేరుకుని కారు నుంచి బయటకు వచ్చి చెరువులో స్నానం చేసి, వచ్చారు. ట్రాఫిక్ సిబ్బంది వచ్చి యువకులకు డ్రంకన్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేశారు. అనంతరం కారును బయటకు తీసి, యువకులు వెళ్లిపోయారు.



చిల్లపేట చెరువును ఆనుకుని కాలువలోకి దూసుకుపోయిన కారు

సంగివలస మార్గంలో దుమ్ము, ధూళి

స్థానికులకు శ్వాసకోశ సంబంధిత సమస్యలు

తగరపువలస: జీవీఎంసీ రెండోవార్డు సంగివలస గ్రామం రెండేళ్లుగా దుమ్ము, ధూళితో నిండిపోవడంతో స్థానికులు శ్వాసకోశ సంబంధిత వ్యాధులకు గురవుతున్నారు. గతంలో గోస్తనీనది నుంచి పైపులైన్ పునర్నిర్మాణం జరిగినప్పుడు పద్మనాభం మండలం సామియ్యవలస నుంచి సంగివలస జాతీయరహదారి వరకు గోతులు తవ్వి, సక్రమంగా పూడ్చలేదు. దీనికి తోడు ఈ మార్గంలో ఇటుక బట్టీలకు చెందిన భారీ వాహనాల రాకపోకల కారణంగా గోతులు మరింతగా కుంగిపోయి దుమ్ము, ధూళితో నిండిపోయాయి. దీంతో ఎల్లమ్మ చెట్టు నుంచి బ్రాహ్మణవీధి, శివాలయం వీధి, సంగివలస గ్రామం, ప్రధానరహదారిపై ఎర్రటి దుమ్ము కమ్ముకుంది. వాహనాల రాకపోకలు జరిగిన ప్రతీసారి పెద్ద ఎత్తున ధూళిరేగి చుట్టుపక్కల వారి ఇళ్లపై పడటమే కాకుండా ముక్కు, కళ్లపై ప్రభావం చూపుతోంది. చుట్టుపక్కల ఇళ్లకు చెందిన పెరటి పంటలు కూడా దుమ్ము కొట్టుకుపోయాయి. దుమ్ము, ధూళి కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నా జీవీఎంసీ పట్టించుకోవడం లేదని సంగివలస ప్రజలు వాపోతున్నారు.



హైవేను ఆనుకుని సంగివలస మార్గంలో దుమ్ము కొట్టుకుపోయిన రోడ్డు



బ్రాహ్మణవీధి వద్ద రహదారిపై దుమ్ము కొట్టుకుపోయిన దృశ్యం